వ్యర్థాలతో అద్భుతం

సక్రమంగా వినియోగించుకోవాలే గానీ పనికి రానిదంటూ ఏదీ ఉండదు. అందుకు తార్కాణమే రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (త్రిబుల్ ఆర్) విధానం. జీవీఎంసీ వినూత్న ఆలోచనతో పనికి రాని గాజు, కాగితం, మెటల్, ప్లాస్టిక్, టైర్లు, వస్త్రాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పాత బట్టలు, పాత చెప్పులు తదితర సామగ్రితో కుర్చీలు, స్కూటర్లు, పలు రకాల ఆట వస్తువులు రూపొందించింది. సిరిపురం దత్ ఐలాండ్, 31వ వార్డుతో పాటు మరిన్ని ప్రాంతాల్లో వీటిని అందంగా ప్రజల అందుబాటులోకి తీసుకొచ్చింది.



ఇది కదా అభివృద్ధి

- పనికిరాని వస్తువులతో ఆహ్లాదకరంగా రూపకల్పన
- ఎనిమిది జోన్లలో త్రిబుల్ ఆర్ సెంటర్ల ఏర్పాటు
- పిల్లలు, పెద్దలను అలరిస్తున్న ప్రాంగణాలు



అందంగా రూపుదిద్దుకున్న సిరిపురం జంక్షన్‌లోని దత్ ఐలాండ్ ప్రాంగణం



దత్ ఐలాండ్ వద్ద వేస్ట్ మెటీరియల్‌తో తయారు చేసిన స్కూటర్లు.. కుర్చీలను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ (ఫైల్)

త్రిబుల్ ఆర్ సెంటర్ల ఏర్పాటు.. నిధుల వివరాలు

- రూ. 19 లక్షలు కేటాయింపు
- 1600 కిలోల టైర్లు, ఇతర వ్యర్థాలతో క్రీడా పరికరాలకు రూపకల్పన
- జీవీఎంసీ పరిధి 8 జోన్‌లలో ఏర్పాటు
- ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటైన 'ఉమెన్స్ రెస్టో కెఫే'
- వ్యర్థాలతో తయారై ముచ్చట గొలుపుతున్న స్కూటర్లు, కుర్చీలు
- త్రిబుల్ ఆర్ సెంటర్లకు వీకెండ్లలో పిల్లలు, పెద్దల తాకిడి



31వ వార్డులో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దిన ప్రాంగణం

డాబాగార్డెన్స్ : వ్యర్థాల నిర్వహణకు అత్యంత కీలకమైన రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) పద్ధతిని ప్రోత్సహించేందుకు జీవీఎంసీ చేపడుతున్న కార్యక్రమాలు నగర ప్రజలను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. జీవీఎంసీ పరిధి ఎనిమిది జోన్లలో ప్రజలకు అందుబాటులో ఉండేలా కేంద్రాలు ప్రారంభించారు. త్రిబుల్ ఆర్ సెంటర్ తనదైన శైలిలో వినూత్న థీమ్స్‌తో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కలిగి, వ్యర్థాల పట్ల, వ్యర్థాల పునర్వినియోగం పట్ల ప్రజల ఆలోచన ధోరణిలో మార్పు తేవడమే గాక జీవన విధానం, దైనందిన అలవాట్లలో ఓ కొత్త ఒరవడిని తీసుకువస్తోంది. జోన్-4 పరిధి జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో 'ఉమెన్స్ రెస్టో కెఫే'ని ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ వివిధ వ్యర్థాలతో తయారు చేయబడిన వస్తువులు ప్రదర్శించారు.

వ్యర్థాలంటే..

మనం ప్రతి నిత్యం ఉపయోగించిన తర్వాత వ్యర్థాలుగా పారవేసే అనేక రకాలైన గాజు, కాగితం, మెటల్, ప్లాస్టిక్, టైర్లు, వస్త్రాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పాత బట్టలు, పాత చెప్పులు.. ఇలా ఒకటేంటి ఎన్నో రకాల వస్తువులు ఈ త్రిబుల్ ఆర్ సెంటర్ల ద్వారా సేకరించి వాటిని పునర్వినియోగించడమే గాక వాటిని వాడుకలోకి తీసుకువచ్చేలా జీవీఎంసీ చర్యలు చేపట్టింది. ఫలితంగా విశాఖ నగర సమగ్ర పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు ఆర్థిక స్థిరత్వాన్ని కూడా సాధించేందుకు వీలు కలుగుతోంది. పిల్లలకు పనికి వచ్చే ఆట వస్తువులతో పాటు వినియోగించుకో గలిగే అనేక వస్తువులు తయారు చేసుకోవచ్చు. సిరిపురం జంక్షన్‌లో వ్యర్థాలతో రూపొందించిన స్కూటర్లు, కూర్చునేందుకు వీలుగా టైర్లతో రూపొందించిన కుర్చీలు.. రంగు రంగులతో.. విశాలంగా తీర్చిదిద్దిన ఆ ప్రాంతంలో ఎంతో మంది వీకెండ్‌లో సేద దీరుతున్నారు.

త్రిబుల్ ఆర్ కేంద్రాలు సూపర్..



అభివృద్ధి, పర్యావరణ నియంత్రణకు త్రిబుల్ ఆర్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతున్నాయి. నగరంలోని జోన్-4 పరిధి 31వ వార్డుతో పాటు అన్ని జోన్‌ల పరిధిలో త్రిబుల్ ఆర్ సెంటర్లు ఏర్పాటు చేశారు. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. తక్కువ వినియోగం, పునర్వినియోగం, శుద్ధి చేసి వినియోగించడంపై ప్రజల్లో అవగాహన పెంపొందుతుంది. వ్యర్థాలతో ఇక్కడ ఏర్పాటు చేసిన త్రిబుల్ ఆర్ సెంటర్ సూపర్‌గా ఉంది.

– బండారు లోకేష్ కుమార్, మహారాణిపేట

ఎంజాయ్ చేస్తాం..



ప్లాస్టిక్ వ్యర్థాలు, టైర్లతో రూపొందించిన వస్తువులు చూడముచ్చటగా ఉన్నాయి. వీకెండ్‌లో కుటుంబ సభ్యులతో ఇక్కడికి వచ్చి కొంత సేపు ఎంజాయ్ చేస్తాం. స్కూటర్లు, కుర్చీలు ముచ్చట గొలుపుతున్నాయి. వీటితో ఈ ప్రాంతానికి చక్కటి కళ వచ్చింది.

అరుణ రాజేశ్వరి, వన్‌టౌన్

క్లుప్తంగా

పుస్తక ప్రియులకు డెంటల్ హెల్త్ కార్డులు

మహారాణిపేట : విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనకు విచ్చేసే పుస్తక ప్రియులకు వీ డెంటల్ ఆస్పత్రి సహకారంతో ఫ్యామిలీ డెంటల్ హెల్త్ కార్డులు అందజేశారు. ఆదివారం పుస్తక ప్రదర్శన సందర్శకులకు ఆస్పత్రి డైరెక్టర్ కేఎంకే రమేష్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు హెల్త్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కేఎంకే రమేష్ మాట్లాడుతూ నోటి ఆరోగ్యంపై అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ హెల్త్ కార్డు ద్వారా కుటుంబ సభ్యులకు ఉచిత దంత వైద్య పరీక్షలు చేస్తామన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు జరిగే పుస్తక ప్రదర్శనకు విచ్చేసే సందర్శకులకు ఈ కార్డులు అందజేస్తామని తెలిపారు.

కిటకిటలాడిన ఎర్నిమాంబ ఆలయం



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం కార్తీక మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఈవో సురేష్‌బాబా నేతృత్వంలో ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, చేశారు. భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. అమ్మవారి సన్నిధికి విచ్చేసిన భక్తులు వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ పర్యవేక్షించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్ : 'వేదం అణువణువున నాదం' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కళారంగ ప్రముఖుడు సన్‌మూర్తి, ఎంవీ రాజశేఖర్, భయ్యా శ్రీనివాస్, వెంకటేష్ పట్టెం, రాజాపాత్రుడు తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయకుడు ఆంజనేయరెడ్డి స్వర నిర్వహణలో నగరానికి చెందిన గాయనీ గాయకులు జ్యోతి, ఆంజనేయులు, నరసింహ మూర్తి, వెంకట్, సురేష్ కన్నా, లావణ్య, కల్యాణి, శైలజ హుషారైన గీతాలతో అలరించారు.

ఘనంగా బ్రాహ్మణుల కార్తీక సమారాధన

సింహాచలం: సింహాచలం ప్రాంతానికి చెందిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన శ్రీ కృష్ణాపురం లోని కాశీరాము తోటలో ఆదివారం ఘనంగా జరిగింది. వేదికపై పరమేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన చేశారు. చిన్నారులు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు.

సాధిక్ విమర్శలు సిగ్గుచేటు

కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు



మాట్లాడుతున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

డాబాగార్డెన్స్ : నియోజకవర్గంలోని 39వ వార్డులో సుమారు రూ.3 కోట్ల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి జరగలేదా? రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కింద ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాల, ఎంవీడీఎం హైస్కూల్, రూ.9 కోట్ల జీవీఎంసీ నిధులతో యూజీడీ ప్రాజెక్టు, డంపింగ్ యార్డ్‌లో త్రిబుల్ ఆర్ యూనిట్ ఏర్పాటు చేస్తే వార్డులో అభివృద్ధే జరగలేదని ఆ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ ప్రకటించడంపై 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ప్రశ్నించారు. సాధిక్ పార్టీకి రాజీనామా చేస్తూ, పార్టీలో మాటకు విలువ లేదని, ప్రభుత్వం అభివృద్ధి చేయలేదని, అభివృద్ధి పనులు ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారని ప్రకటించిన నేపథ్యంలో విల్లూరి భాస్కరరావు ఖండిస్తూ ఆదివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిపై చేసిన విమర్శలపై విల్లూరి ఘాటైన సమాధానం చెప్పారు. కోట్లాది రూపాయలతో వార్డులో అభివృద్ధి పనులు జరిగితే అభివృద్ధి జరగలేదని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో 24 గంటలు గడవక ముందే బాధితులకు నష్టపరిహారం కింద రూ.9 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకురావడంపై వైవీ సుబ్బారెడ్డి పనితీరు కనిపించలేదా? అని ప్రశ్నించారు. వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు, ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో చేస్తున్న అభివృద్ధి పనులు కనిపించలేదా? స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన మీరు ఏ పార్టీలోకైనా వెళ్లిపోవచ్చు. పార్టీకి రాజీనామా చెయ్యొచ్చు. తప్పులేదు కానీ వెళ్తూ వెళ్తూ ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడిగా మిమ్మల్ని గౌరవంగా చూసుకున్న తల్లి లాంటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, దుర్గాలమ్మ ఆలయ చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు భక్తి మంగరాజు, కంటిపిల్లి వరలక్ష్మి, రమణమ్మ, మైనార్టీ నాయకుడు సయ్యద్ జహంగీర్, గరుడా జగన్నాయకుల సత్రం ధర్మకర్త గౌరుసు నాగిరెడ్డి, 35వ వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఘనంగా అంబలం పూజ



గురుస్వామి బండారు గజపతిస్వామిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు శ్రీరామ్ స్వామి అయ్యప్ప మాల ధరించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఘనంగా అంబలం పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాన్ని 40వ పడి, 99 సార్లు శబరిమలైను దర్శించుకున్న గురుస్వామి గజపతి చేతుల మీదుగా నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అంబలం పూజలో పాల్గొన్నారు. వివేకానంద సంస్థ సభ్యుడు బండారు గజపతిస్వామి (గురుస్వామి) ఆధ్వర్యంలో అంబలం పూజ జరపడం గొప్ప విశేషమని, గురుస్వామి 99 సార్లు శబరిమలైను దర్శించుకుని 40 సార్లు ఇరుముడులతో అయ్యప్పను దర్శించుకోవడం గొప్ప విషయమన్నారు. గజపతిస్వామి వివేకానంద సంస్థ సేవా కార్యక్రమాల్లో చాలా చురుగ్గా పాల్గొంటూ, ఈ వయస్సులో కూడా చేస్తున్న సేవలు అభినందనీయమని సత్కరించారు. అలాగే పలు పీఠాధిపతులను సత్కరించారు. పూజా కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మత్స్యకార నాయకుడు చోడిపిల్లి అప్పారావు, మైనార్టీ నాయకులు ముజీబ్‌ఖాన్, యాసిన్ బాబ్జి, సంస్థ సభ్యులు, మహిళా సభ్యులు, పలువురు అయ్యప్పలు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలకు మార్గదర్శకులు 'కట్టమంచి'



ఆచార్య కె.ఎస్.చలం రచించిన వలస నాటకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

మహారాణిపేట : సాహిత్య రంగంలో సరికొత్త భావాలకు, నూతన ఆలోచనా రీతులకు మార్గదర్శకులుగా నిలిచిన వ్యక్తి కట్టమంచి రామలింగారెడ్డి అని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం సాయంత్రం విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో అరసం, ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్టు సంయుక్త నిర్వహణలో డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి సాహిత్యం–విమర్శ అంశంపై జరిగిన సాహిత్య సభలో ఆచార్య కె.ఎస్.చలం, ఆచార్య చందు సుబ్బారావు, ఆచార్య వెలమల సిమ్మన్న పాల్గొని మాట్లాడారు. ఒక వైపు తెలుగు కవితను మరో వైపు కవితా విమర్శను నూతన శోభతో కొత్త కాంతులతో ఆవిష్కరించిన సాహితీ మూర్తి కట్టమంచి అని, సంభాషణలతో దెబ్బకు దెబ్బ తీయగల నేర్పు, వాదనా చాతుర్యం ఆయన శైలి అన్నారు. హాస్య ప్రియత్వం, ఛలోక్తులు, చమత్కార సంభాషణ నైపుణ్యం వంటి లక్షణాలతో రామలింగారెడ్డి అందరినీ ఆకట్టుకునేవారు అని కొనియాడారు. సాహితీవేత్తగా, వక్తగా, విమర్శకుడిగా, విద్యావేత్తగా, రాజనీతిజ్ఞుడిగా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేశారని గుర్తు చేశారు. శత వసంతాల తెలుగు సాహిత్య ప్రస్థానం గురించి ఆలోచించేటప్పుడు మొట్ట మొదట మెదిలే కొద్ది మంది వైతాళికుల్లో కట్టమంచి రామలింగారెడ్డి ఒకరని పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విశాఖలో నెలకొల్పడంలో కట్టమంచి విశేష కృషి చేశారన్నారు. ఆచార్య కె.ఎస్.చలం రచించిన వలస నాటకం పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మేనేజర్ పి.ఎ.రాజు, బండి సత్యనారాయణ, అడపా రామకృష్ణ, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

'గీతా' విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు పొందిన చిన్నారులతో నిర్వాహకులు

డాబాగార్డెన్స్ : గీతా మౌఖిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. 3 విభాగాల వారికి ప్రథమ బహుమతిగా బంగారు పతకం, ద్వితీయ బహుమతిగా వెండి, తృతీయ బహుమతిగా కాంస్య పతకంతో పాటు మెడళ్లు, నాల్గో విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆచార్య సార్వభౌమ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. శ్రీకృష్ణ పరమాత్మునిచే అనుగ్రహించబడిన భగవద్గీత గ్రంథం విశ్వమంతటా విశ్వసనీయ గ్రంథంగా విరాజిల్లుతోందని పేర్కొన్నారు. భగవద్గీత శ్లోకాల్లో గల పరిపూర్ణమైన సారాంశాన్ని తెలుసుకుని ఆధ్యాత్మిక చైతన్యంతో ఆనందదాయకంగా జీవించాలన్నారు. గత 50 ఏళ్లుగా గీతా ప్రచార సమితి నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా భగవద్గీతలో శ్లోకాలపై శిక్షణ ఇస్తున్న 18 మంది గురువులను సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు పి. జగన్‌మోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కార్యదర్శి వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, లక్ష్మీనరసింహ, కనకవల్లి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వృద్ధుల క్రిస్మస్



క్రిస్మస్ వేడుకల్లో కోడిగుడ్ల శ్రీధర్, పీపీసీ సభ్యులు

కంచరపాలెం : మానవత్వాన్ని చాటే ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తామని వైఎస్సార్‌సీపీ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, సెయింట్ పీటర్స్ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ అన్నారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జ్యోతి నిలయంలో ఆదివారం మాన్యువల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వృద్ధుల క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు సబ్బవరపు మాణిక్యాలరావు నేతృత్వంలో ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. కోడిగుడ్ల శ్రీధర్ మాట్లాడుతూ వృద్ధులతో కలిసి క్రిస్మస్ సంబరాల్లో పాల్గొనడం ఆనందదాయకం అన్నారు. అనంతరం కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ పలువురు వృద్ధులను సన్మానించారు. తన సొంత నిధులతో సుమారు 800 మందికి భోజనాలు, వస్త్రాలు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎక్స్ అఫిషియో సభ్యులు ఐరోతి మరియదాస్, రాజాన శ్రీను, శ్యామ్‌సుందర్, కమల్, అన్నపూర్ణ, అన్నపూర్ణ, దేవి, మాన్యువల్ వెల్ఫేర్ సభ్యులు, పీపీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల ఉల్లంఘన బాధాకరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

డాబాగార్డెన్స్ : ఇప్పటికీ మానవ హక్కుల ఉల్లంఘన అనేక చోట్ల జరుగుతూనే ఉందని దామోదర సంజీవయ్య మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వై. సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. మానవ హక్కుల సమితి రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ నేతృత్వంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు అనేక హక్కులు కల్పించిందన్నారు. అయితే ఆ హక్కులు దుర్వినియోగం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ తాము నిరంతరం మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. తమ హక్కులకు భంగం కలిగితే ఎవరైనా తమను సంప్రదిస్తే వారికి న్యాయం జరిగే వరకూ అండగా నిలబడి పోరాడుతామని స్పష్టం చేశారు. కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహనరావు మాట్లాడుతూ మానవ హక్కుల విషయంలో రాజీ పడకుండా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బోర్డు ఆఫ్ స్టడీస్ ఆఫ్ లా చైర్మన్, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం, మానవ హక్కుల ప్రతినిధులు ఎస్‌వీ రమణ, సోమసుందరరావు, బి. మల్లేశ్వరరావు, నక్కాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా పయనించాలి



ఐక్యత చాటుతున్న బీసీ నాయకులు

డాబాగార్డెన్స్ : దేశం, రాష్ట్రంలో సంఖ్యాపరంగా అధికంగా ఉన్న బీసీ సామాజిక వర్గాలు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగళరావు యాదవ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమార స్వామి పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ ఆహ్వాన కార్యక్రమంలో పాల్గొన్న మాట్లాడారు. అత్యధిక సంఖ్యలో ఉన్న బీసీలు రాజకీయంగా అభివృద్ధి చెందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో 40 రోజుల పాటు రథయాత్ర నిర్వహించనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో బీసీలకు 90 అసెంబ్లీ, 13 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో 275 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు మహిళా సబ్ కోటా కల్పించాలన్నారు. సంఘం జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో తప్పనిసరిగా 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో వై. నూకాలమ్మ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'దయాళ్‌బాగ్' వస్తు ప్రదర్శనకు విశేష స్పందన

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లో దయాళ్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన వస్తు ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. దయాళ్‌బాగ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో దేశంలో పలు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూట్లలో తయారు చేసిన వస్తువులను తక్కువ ధరకు ప్రతి సంవత్సరం డిసెంబరు రెండో ఆదివారం ప్రదర్శన ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇక్కడ షర్ట్ క్లాత్‌లు, తువ్వాళ్లు, బెడ్ షీట్లు, షూలు, చెప్పులు, నూనెలు, సబ్బులు, అగరుబత్తిలు, బనియన్లు, డిటర్జెంట్ పౌడర్లు తదితర వస్తువులను నిర్వాహకులు ప్రదర్శనలో విక్రయానికి పెట్టారు. విశాలాక్షినగర్, ఆరిలోవ, ఆదర్శనగర్, ఎంవీపీ కాలనీతో పాటు నగరంలో పలు ప్రాంతాల నుంచి వందలా మంది రావడంతో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ ప్రదర్శనలో వస్తువుల విక్రయం సుమారు గంటలోనే ముగిసింది. ఈ సందర్భంగా ప్రదర్శన ఇన్‌చార్జి కె.ఎస్.ప్రకాష్‌రావు మాట్లాడుతూ ప్రదర్శనలో రూ.6 లక్షలు విలువ చేసే వస్తువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నాణ్యమైన వస్తువులు కావడంతో ప్రతి సంవత్సరం ఇక్కడ ప్రదర్శన కోసం ప్రజలు ఎదురు చూస్తుంటారన్నారు. రూ.ఆరు లక్షలు వస్తువులు గంట సమయంలో విక్రయించామన్నారు.

జంగమ కుటుంబ ఐక్యతను పెంపొందించాలి

మర్రిపాలెం: జంగమ కుటుంబ ఐక్యతను పెంపొందించాలని జంగమ సేవా సంఘం అధ్యక్షుడు శృంగారకవి మహేశ్వరరావు అన్నారు. 51వ వార్డు మాధవధార మామిడి తోటల్లో సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కుటుంబీకుల ఆత్మీయతను పెంపొందించేందుకు కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ప్రతి ఏడాది జంగమ కుటుంబాల కలయికకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు సంఘం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం అక్కడ వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేశారు. పిల్లలు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
E.P.36/2021 in O.S. 899/2016

Between :
Pandiri Divya ...Decree Holder
And
Pampana Rambabu ...Judgment Debtor

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీబాకీ మరియు వడ్డీ, ఖర్చులు రాబట్టు నిమిత్తం పై జడ్జిమెంట్ డెటారు యొక్క ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని తేది. 27-12-2023వ ఉ॥ గం॥ 10.30 ని॥ల నుండి సా॥ గం॥ 5.00 మధ్య సమయంలో వేలం వేయుటకు పై శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలంపాటలో పాల్గొనదలచిన ఆసక్తిగలవారు పై తేదిన శ్రీ కోర్టువారి ఎదుట ఉ॥గం॥ 10.30 ని॥లకు హాజరుకావలెననియు ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయడమైనది.

SCHEDULE OF PROPERTY

Ground floor R.C.C. house bearing D.No.19-9-5, consisting around 300 Sft and first floor consisting around 180 Sft in extent of 34 Sq. yds or 28.43 Sq.mts of T.S.No.653 Asst No.10000050091 Mandavari Veedhi Maharanipeta Ward, Visakhapatnam and bounded as follows: East : Wall of K.G.H, South: Bammi Kesava Rao and Satyavathi Part sold by defendant, West: Muncipal Lane, North: House of Gidituri Annapurna.

DHR Value : Rs. 8,00,000/-
Amin Value : Rs.18,50,000/-
J.Dr Value : Not furnished

M.K.S. ASSOCIATES
M.S. VENKATESH, M.K. SRINIVAS & M. KAUSHIK, Advocates, Visakhapatnam. Cell : 9866668494